శాస్త్ర గురు బోధలను మఱి స్వానుభవము
కలిమి నెద్దాని నరుఁడేదుగడఁగ నమ్ము
నదియె శ్రేష్ఠంబుఁబరమహా నదియు, యదెజ
గంబునన్ వాని కవలంబనంబు సాయి !

జీవిత సభ్యత్వ చందా రు. 116/లు పంపినవారు

1 శ్రీ రెబ్బాప్రగడ వెంకట రాజేశ్వరరావు
Advocate, కొవ్వూరు.

2. శ్రీ డాక్టర్. కంచర్ల రామకుమార్, గుంటూరు.

3. శ్రీ తిప్పరాజు కామేశ్వరరావు, గుంటూరు.

4. శ్రీ ఆదిపూడి మోహనరావు, గుంటూరు.

వీరిని, వీరి కుటుంబ సభ్యులను శ్రీ సాయీ ప్రభువు సంరక్షించుగాక!

వార్షిక చందా :- రు. 12/- జీవిత సభ్యత్వం :- రు. 116/-

సభ్యులెల్లరు చందాలు ఈ దిగువ చిరునామాకు పంపి సహకరించ ప్రార్థన.

శ్రీ శ్రీకంఠ కృష్ణమూర్తి, B. A.
కార్యదర్శి.
ఓమ్ శ్రీ సాయీరామ్ ఆధ్యాత్మిక చైతన్య కేంద్రం,
4-3-5, 2వ లైను, రామన్నపేట,
గుంటూరు—522 007

1000-ప్రతులు కుబేర ప్రింటర్స్-చీరాల.

ఓమ్ శ్రీసాయినాథాయనమః

ప్రార్థన

శ్రీసిద్ధివిఘ్నేశ ! సేవింతునయ్యా !
దోసముల్ దులిచి సంతుష్టి నిమ్మయ్యా !
శ్రీసాయి పదభక్తిఁ జేకూర్పు మయ్యా !
వాసిగ విఘ్నముల్ వారింపుమయ్యా !

◎ ◎ ◎

సాకారుండవా ! లేక ని
రాకారుఁడవో ! మతేమియగుదువో! యెఱుగన్
నాకగునె ? శ్రితుఁడ, జడుఁడను
సాకవె! నీ కరుణఁబఱపి సాయీనాథా!

◎ ◎ ◎

గురుడవునీవే! సాయీ
పరమాత్ముఁడ వీవెనాకు; పావనమౌ నీ
చరణంబులె శరణంబని
ధరనమ్మి కొలుతుఁగృపఁగను తండ్రీ! హానుమా!

◎ ◎ ◎

శారదా శారదాంభోజ వదనా వదనాంబుజే
సర్వదా సర్వదాఽస్మాకం సన్నిధి స్సన్నిధింక్రియాత్

◎ ◎ ◎

జనని! యంభోరుహాంబు నీజన్మగృహము,
పద్మనాభు వక్షంబు నీభర్తృ గృహము,
లలిత కృప నింక నీదు లీలాగృహంబు,
సలుపు కొనవె! నాహృదయాంబుజంబు; లక్ష్మి!

◎ ◎ ◎

సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థ సాధికే,
శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోఽస్తు తే!

◎ ◎ ◎

ఓమ్ శ్రీ సాయీనాథాయనమః

విజ్ఞప్తి

శ్రీసమర్థ సచ్చిదానంద సద్గురు సాయీనాథ మహారాజునకు జయము.

భక్త మహాశయులారా!

"ఓమ్ శ్రీసాయిరామ్" ఆధ్యాత్మిక చైతన్య కేంద్రము గుంటూరు వ్యవస్థాపకులు– చి. శ్రీ. ఆదిపూడి మోహనరావు గారికి షిరిడి సాయీప్రభుని తత్వప్రచార సాధనగ ఒక పత్రిక "ఓమ్ శ్రీసాయిరామ్" అనే చైతన్య నామముతోనే నడుపవలెనను చిరకాల వాంఛతో శ్రీసాయీనిలయమ్– చెరువు విచ్చేయుట, అందువేంచేసియున్న శ్రీ సాయీ ప్రభునికి, మాతండ్రి గారి పరమ పవిత్ర పాదుకలకు ప్రార్థనాదులను సలిపి, ఆశీస్సులు పొంది ముందుగ పూజ్యశ్రీ చోడవరపు సాంబమూర్తి పంతులు గారిని గౌరవాధ్యక్షులుగ వుండి నడిపింపుమని ప్రాధేయపడి అభ్యర్థించుటయు, అందుకువారు ఆనందముతో ఆమోదించి ఆశీర్వదించుటయు నాందీ ప్రస్తావనమై ప్రయత్నము ప్రారంభమైనది. కాని యీ పేరున పత్రిక నడుపుటకు ప్రభుత్వానుమతి అవుసరమై నందున అది లభించువరకు "ఓమ్ శ్రీసాయిరామ్" అను పేర పెక్కు సంపుటములుగ ప్రతిమాసము 16 పుటలు తక్కువ లేకుండ ప్రచురించవలెనని ప్రకాశకులు భావించి, శ్రీసాయీప్రభుని అపారకరుణ వల్ల ఆ ప్రభుని 67వ మహాసమాధి పర్వదిన సందర్భముగ పెక్కు పుటలతో ప్రథమ సంపుటము వెలువరించి మీ కందించ గలిగితిమి.

శ్రీ షిర్డి సంస్థాన ఆస్థానపండితులని బిరుదు గాంచిన కీ. శే. శ్రీబాపట్ల హనుమంతరావు పంతులుగారిచే విరచితంబైన "మహాసమాధి" వ్యాసము, యితరస్వానుభవములు, సాయీ భక్తుల నెల్లరను ఉత్తేజపరచి ఆనందామృతము నందించగలదు. ఈసంపుటము

ప్రారంభ పత్రికగ భావించి. మహోభక్తాగ్రగణ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, రచయితలు అమోఘమైన ఆశీస్సులు, అభినందనలు, సందేశములు, రచనలు అసంఖ్యాకముగ పంపించి మమ్ములను ముగ్ధులను చేసిరి. మాకృషి శ్రీసాయీ ప్రభువు యిందరరూపున శ్లాఘించెనను ఆనందాను భూతిని పొందుచున్నాము. వీరికెల్లరకు మా కృతజ్ఞతా పూర్వక నమస్కృతులను అందించుకొనుచున్నాము. ఈ సంపుటములో అందరి శుభాకాంక్షలు రచనలు ప్రకటించ లేనందులకు మన్నింతురుగాక!

మీసహకార సహాయములతో ముందు ముందు అధిక సేవలు అందించగలమని ఆశించుచున్నాము.

కృషి కృతార్థ మగును సాయికృపనుం బడయ !

—సంపాదకులు

* * *

—ఓమ్ శ్రీసాయీపరబ్రహ్మణేనమః—

ఓమ్ శ్రీ సాయిరాం ఆధ్యాత్మిక చైతన్య కేంద్రము శ్రీ సచ్చిదానంద సమర్థ సద్గురు శ్రీసాయినాథ చరణసేవాబృందము

వ్యవస్థాపకులు:— శ్రీ ఆదిపూడి మోహనరావుగారు

ఓమ్ శ్రీ సాయిరాం నామజపయజ్ఞ ప్రచారకులు గుంటూరు వారిచే ప్రచురింపబడు ఓమ్ శ్రీ షిర్డిసాయిబాబాతత్త్వ ప్రచారము

సంపాదకులు:- శ్రీ బాపట్ల వేంకట పార్థసారధిగారు

శ్రీ సా యి ని ల య మ్, చె రు వు

శ్రీఅనంతప్రేమమందిరా—అపారకరుణాసాగరా

శ్రీసమర్థసద్గురుసచ్చిదానంద సాయినాథమహారాజ॥

హేపరమేశ్వరదీనదయాళో శ్రీ సాయినాథగురుదేవకృపాళో —

రక్షరక్షజగదీశ్వరసాయి ఆర్తత్రాణపరాయణసాయి—మాంపాహి

: ఆశీస్సులు :

యుగ పురుషోత్తముడైన శ్రీ షిర్డిసాయినాథుని నిజతత్త్వ ప్రచారమునకు సత్యాన్వేషణముగా-ఓమ్ శ్రీ సాయిరాం అను మాస పత్రిక నడుప సంకల్పించుట శ్లాఘనీయము. హర్షదాయకము. బాబా నా నామ ప్రచారము- నా తత్త్వప్రచారము గావించువారు నాకు ప్రీతి పాత్రులు, అని సెలవిచ్చినారు. వారు అనుభవించి ఆనందించిన, ఆదేశ సందేశములు—సూక్తులు, ప్రత్యక్ష ప్రమాణములుగా విలసిల్లు దివ్యలీలానుభూతులతో నిండియున్న వారి జీవితచరిత్రయందలి గుహ్యమైన విషయము అందరు-అందుకొని ఆచరించి - తరించాలనే సత్సంకల్పముతో వాటినన్నిటిని, కూలంకషముగా ఆకళింపుచేసుకొన్న మహా మహిమాన్వితులైన శ్రీ బాపట్ల వేంకట పార్థసారధిగారి సారథ్యంతో- సంపాదకీయముతో- నిర్వహింప నిశ్చయించుట మరొక విశిష్టత ప్రత్యేకతను సంతరించు కున్నది. ఈ పత్రిక - శ్రీ షిర్డీశునికరుణతో - కలకాలం చిరంజీవిగా — ఆదర్శ వంతముగా వర్థిల్లి శోభించుగాక, యని హృదయ పూర్వకముగా కోరుకుంటున్నాను. శ్రీ సమర్థ సద్గురువు సచ్చిదానంద సాయినాథుని నిండు హృదయ ఆశీస్సులు సదా వర్షించుగాక! శ్రీ సాయి ప్రభువు ప్రేరణచే జరుప బడు ఈ ఉద్యమమునకు ఇతరుల ఆశీస్సులు ప్రసక్తియు అప్రస్తుత మన్న సత్యమును గుర్తింతురుగాక. ఓమ్ తత్సత్

నిత్యము ఓమ్ శ్రీ సాయిరామ్ నామకోటి వ్రాయండి.

శ్రీ సాయి సందేశము

యుగధర్మములననుసరించి- మానవుడవతరించుటకు- భక్తిమార్గమే- సులభమని- ఆర్యులు సిద్ధాంతీకరించినారు- భక్తిమార్గమున నవవిధ భక్తులు గలవు. అందున నామస్మరణమే సులభమైనది శక్తివంతమైనది భవతారకమైనది- అందుకే స్మరణేవముక్తిః కలియుగే- అన్నఆర్యోక్తి సర్వులకు తెలిసినదేగదా-

రామాయణంలో- రామనామమా- రామబాణమా! ఏది గొప్పది- అన్న సన్నివేశమొకటి గలదు. దానినే శ్రీ రామాంజనేయ యుద్ధము అనినారు. అందులో తనజీవనాధారము జీవిత పరమావధి జీవనము అయిన్న రామనామ తారక ప్రభావముచే హనుమదప్ప-శ్రీ రామచంద్రమూర్తి వాలిబాణ ప్రతాపమునే చల్లార్చినాడు, అన్న సంగతి జగద్విదితము.

దానినే షిర్డిసాయినాథు డనుసరించి నాడనుటకు వారిచరిత్రయందలి దాసుగణు అను మహాభక్తుని శుద్ధభక్తిప్రపత్తులతో -నామసప్తాహ మొనరించిన నీకామ్యము ఫలించి తీరునని వాగ్దాన మొనరించి, పాండురంగవిఠలునిగా దర్శన భాగ్యమిచ్చినారు-తద్వారా నామస్మరణచే పొందలేనిది ఏదీలేదు- సర్వము లభ్యమే అని ఋజువు పర్చబడినది.

ఎనభై మూడు లక్షల తొంభైతొమ్మిదివేల తొమ్మిదివందల తొంభైతొమ్మిది జన్మలగడిపి, మానవజన్మను సంతరించుకున్నది ప్రతిజీవి. అట్టి మానవతను పొందిన ప్రతి ఒక్కరు అన్ని జన్మలలో సంతరించుకున్న మంచి చెడ్డల- పుణ్యపాపముల సంస్కార జనితములైన కర్మలను సంచితము- ప్రారబ్దము-ఆగామి- అను పేర్లతో విభజించి, చేసినకర్మలననుభవించి తీరవలెనని సిద్ధాంతీకరించినారు.

విత్తనమునుబట్టి వృక్షము-చేసిన కర్మనుబట్టి ఫలితము కలుగుట సహజముగదా- అదియే ఈనాడు మానవుడు అనుభవించుచున్నది. తత్త్వము అనగా నిజస్థితి. నేటి మానవుడు పుట్టినదాదిగతించువరకు నిత్యము-ఉదయమునుండి నిదురించువరకు సర్వార్థానర్థములకు మూల కారణమైన మనస్సును ఇంద్రియపరము గావించి, దేహాత్మబుద్ధితో-నిరంతర సంఘర్షణలతో - కోరికలు తీర్చుకోవాలనే తపనతో మోహాపీడితుడై విచక్షణ వివేకము కోల్పోయి సంస్కారరహితుడై మనోవ్యధతో ఘూర్ణిల్లు చున్నాడు.

మార్గదర్శియైన గురువు నాశ్రయింపక పోవుట నైతికభ్రష్టత్వము - శోచనీయ మానవత - కాలుష్య వాతావరణము - స్వార్థ పూరిత సంకుచిత దృష్టి - విచక్షణ వివేకరహితమైన ఆచరణ కోరికలు తీర్చుకోనుటయే జీవిత పరమావధి అన్నభావము సత్యము ధర్మము - శాంతి - న్యాయము- ప్రేమ - అన్నవి మాటలలో నేతప్ప చేతలలో కానరాని దుస్థితికిదిగజారుట మానవ జీవితమును మాణిక్యమును విషయ వాసనలను మసి బొగ్గులకు విక్రయించు శోచనీయస్థితి ఇట్టి ప్రస్తుత విపత్కర భయానక భీభత్స నైచ్య హైన్య సంక్షుభిత పరిస్థితులలో

సముద్ధరణార్థం—కలౌసంభవంతం నమామీశ్వరం—సద్గురుం సాయినాథం

పరమాత్మ యుగధర్మముల ననుసరించి తనరూపముల మార్చుకొనును.......... అందుకే ఈ కలియుగ ధర్మము ననుసరించి పరమాత్మ సమర్థసద్గురువుసచ్చిదానంద స్వరూపుడైన షిర్డిసాయినాథుడుగా 1854 సం॥న షిర్డిలో 16 సం॥ బాలుడుగా అవతరించి సశరీరుడుగా 1918 వరకువుండి, సమాధిచెంది-తదనంతరము ఎప్పటికి సర్వప్రాణుల హృదయాంతర్వర్తియై జగత్తును పాలించు చున్నాడు. ఆ జగన్నాథ సాయినాథుడు.

చతుర్వేదసారము – ఉపనిషత్తుల ప్రభావము సకలశాస్త్ర పురాణముల నీతిధర్మ సంచయముల రంగరించి సబూరి–నిష్ట లుగా మలచి తారక మంత్రముగా రూపొందించి అందించినారు. మరియు నా గురు దేవుడు కరుణతో కోరిన సబూరి–నిష్ట.

అవివారికర్పించినాను. ఆయనయందేదృష్టి నిల్పినాను. ఆయన నన్నే కాగ్రదృష్టితో చూస్తున్నారు. నాకేమి కావాలనిపించలేదు. నా భాధ్యతలన్నిటిని వారే భరించినారు. నన్ను నేను మరచిపోయి ఆనందస్థితిలో నిలిచి పోయినాను. ఆశక్తి ననుభవించి ఇంతటివాడ నైనాను. మీకు నేను అందించునది ఆ రెంటినే. మీరు అదే అనుస రించండి–అచరించండి. తరించండి. నా అంతవాడిగా తయారవ్వండి. అన్నారు బాబా. బాబా సకల చరాచరగామి. త్రికాలవేది. త్రికాల జ్ఞాన సంపన్నుడు. అనంత లీలావినోది. సర్వభారతంత్రుడు. స్మృతి మాత్ర సంపన్నుడు. స్మరణమాత్ర సంతుష్టుడు. పిలిచి కటాక్షించే వేల్పు. సకల దేవతాస్వరూపి. వారు ఆచరించి అనుభవించి అందిం చిన అనుభవములే వారి దివ్యచరిత్ర. అదేవారి ఆదేశములు సందేశ ములు. వాటిననుసరించుట మన కర్తవ్యము. ప్రగాఢ దీక్ష ప్రపత్తి (శరణాగతి) మహాధైర్యముతో కూడిన త్యాగనిరతి ఓర్పు అచంచల దీక్ష అశ్రుతర్పణ పీటితో బాబాకు మనసా వాచా కర్మణా అంకి తమై తారకనామములైన ఓం శ్రీ సాయిరాం ఓంసాయి శ్రీ సాయి జయజయసాయి లను సదాజపించుచూ వారి దివ్యచరిత్ర పారాయణ చేయుచూ తననే సర్వస్వముగా భావింపుచూ జరుగునదంతయు వారి ప్రసాదముగా సేవించుచూ నిర్లిప్తముగా జీవనయాత్ర గడుపుచూ సర్వజీవకోటిని తానుగాభావించి ఆదరించి తనియింపజేయు భక్తునకు బానిసనై వెంటజంటగా తోడునీడగా ఉండి కంటికిరెప్పగా కాపా డుచూ ఏకొరత లేకుండా సాకుచూ పతనముకానీయక గమ్యమునకు చేర్చి సుఖశాంతులతో వర్ధిల్లచేసి తరింపచేస్తాను అని వాగ్దానాధ యము నొసంగినారు కావున–

శ్రీ షిర్డీసాయిబాబావారికి ఆ విధముగా అంకితమై, ప్రత్యక్షానుభవముల పొందుచూ, సుఖ శాంతుల తో వర్ధిల్లి తరించుచున్నారు.

బాబా పాదములు సమాశ్రయించిన వారికి ఏకొరత రాదు. అసాధ్యమన్నది కానరాదు; తుదకు ప్రారబ్దమును కూడ తప్పించగల సమర్ధ సద్గురువు, శ్రీ షిర్డీ సాయినాథుడొక్కడే!!

“ గురువే జగత్తుకు మూలము-జగత్తే గురువు ”

ధేనువు - పొద్దున నుండు క్షీరమును నిల్వచేసుకొని, వత్సము దగ్గరకు వచ్చి - పాలను త్రాగించి - లాలించి - ఆనందించు నట్లు - సద్గురువు తన అంకిత బిడ్డల దగ్గరకు వచ్చి సర్వ కామ్యములు తీర్చి - తనియింపచేసి తరింప చేస్తారు. అందువల్లనే పిలిచి కటాక్షించే వేల్పు బాబా ఒక్కరే. వారిలీలలు అనూహ్యములు - అగ్రాహ్యములు. ఈ దిగువ నుదహరింప బడు గురుగీత శ్లోకములు - అంతర్యమును - గుర్తించి ఆచరించి - తరింతురుగాక!

భిద్యతే హృదయ గ్రన్థిః ఛిద్యన్తే సర్వసంశయాః
క్షీయన్తే సర్వ కర్మాణి గురోః కరుణాయాశివే
నగురో రధికం తత్త్వం నగురో రధికం తపః
నగురో రధికం జ్ఞానం తస్మై శ్రీ గురవేనమః
గురుమధ్యే స్థితం విశ్వం విశ్వమధ్యే స్థితో గురుః
గురుర్విశ్వం - నచాన్యోస్తి తస్మై శ్రీ గురవేనమః
శరీర మింద్రియం - ప్రాణ మర్థ స్వజనభాన్ధవాన్
ఆత్మదారాధికం సర్వం సద్గురుభ్యో నివేదయేత్

అట్టిగురు పాదపద్మములను సమాశ్రయించిన నీకు కావలసిన వన్నియు గురు కటాక్షముచే లభించి తరింపగలవు - అన్న ఎరుకను - వీడనాడక - కృతార్థులు కాగలరని-ఆశించుచూ షిర్డీసాయిప్రభువును

కటాక్షించమని ప్రార్థించు చున్నాను. "నారూపమునే భావించుచూ నానామమునే జపించుచూ నా చరిత్రనే పారాయణ చేయుచూ నన్నే సర్వస్వముగా భావించి, నన్నే నిరంతరము తలంచుచున్న భక్తుడెన్నటికి ఉపేక్షింపబడడు" – బాబా.

పలికించినవాడు బాబాయేగా—నేను కాదుగా—శలవు.

శ్రీ సాయిభక్తపాదరేణువు
శ్రీ చోడవరపు సాంబమూర్తి
గౌరవాధ్యక్షులు

ఓం శ్రీసాయిరాం పత్రికాపుత్రికకు
స్వాగతము : శుభాశీస్సులు

శ్రీమంతంబు జగద్ధితంబునగు ఓం శ్రీసాయిరాం పత్రికా
రామారత్నమ! స్వాగతమ్ము జగదారాధ్యుండు శ్రీసాయి త
త్త్వామోదమ్మును దిగ్దిగంతరపరి వ్యాప్తంబు గావించుచున్
ప్రేమానంద రస స్వరూపిణివిగా వేయేండ్లు వర్ధిల్లు మా!

బాపట్ల పార్థసారథి ప్రాపయి సంపాదకత్వ భారము పూనెన్
శాపాడుఁగాఁత మిము సాయీపరమేశ్వరుఁడు సతమభీష్టప్రదుఁడై

జపయజ్ఞంబులనేకముల్ సలిపి విశ్వాసంబు సద్భక్తి ని
ష్కపటత్వంబు గలట్టి మోహనుఁడు దీక్షాదక్షుఁడై తోడ్పడన్
నిపుణత్వంబున పార్థసారథి యశోనిష్ఠితుండు సారథ్యమున్
విపులాధ్యాత్మిక మూర్తియై నెఱపుచున్ వెల్గించుసిన్ పుత్రికా!

సాయీభక్త కవీంద్ర మండనులు విజ్ఞాన ప్రచారంబు సు
శ్రేయంబున్ గలిగింత్రు వ్యాసములతో; జిజ్ఞాసు లోకం బిడున్
జేయూతన్; విడు సందియమ్ము ; విజయ శ్రీరస్తు గీరస్తు, దీ
ర్ఘాయుర్భాగ్య వివృద్ధిరస్తు, నవ కల్యాణీ! కుమారీ మణీ!

శ్రీహనుమంతరాయకవి శేఖరు పుత్త్రిని సాయినాథ ని
ర్మోహ నిరీహసన్నుతులు మున్నొనరించిన తండ్రి పోల్కి సు
స్నేహనిరంతరప్రకృతి నిర్మలుడౌ కవి పార్థ సారథిన్
సాహితి పూర్ణ భారతి ప్రసన్నత నిత్యమనుగ్రహించుతన్

ఇట్లు, సౌజన్య శ్రీ సేవానంద బాలసరస్వతి,
అవధాని శేఖర, కవిరత్న,
విద్వాన్ వంగవోలు ఆదిశేషశాస్త్రి

ఆశీస్సులు : అభినందనలు

మధురకవిరత్న—కవిభూషణ
మూలా పేరన్నశాస్త్రి. విజయనగరం — 2

అనఘా ! యార్ష మతాభి మానమది మృగ్యంబైన యీనాటి భూ
జన మందాస్తిక భావముంజొనుపగా స్వాంతంబునందెంచియో
య్యన సాయీ శుభతత్త్వ మున్ గుఱిచి వ్యాఖ్యానించు మేల్ పత్రికన్
జన సంసేవ్యముగా నొసంగు నినునే శ్లాఘింతువేనోళులన్

గీ॥ దివ్య భక్తి పరిపూర్ణ పత్రికలలోన
పదియు నారుకళలు గలు పార్వణేందు
శుద్ధిగా దినదినమభి వృద్ధి గాంచి
రసను వెలుగును పార్థ సారథి కవీంద్ర !

కొంగుబంగారం

సరసకవితా విశారద మహాకవి

శ్రీ యన్. బి. సహోఝూచారి - రాజమండ్రి

సీ॥ 'దరిజేర రా! సాయి! పరమాత్మ!' యని''మహ
ల్సాపతి'' యెవ్వాని లక్ష్య పఱచె?
'సాక్షాన్మహేశుడే సాక్షాత్కరించెగా!'
యని "మేఘుడె" వ్వాని వినుతిజేసె?
"పాలముంచిన నీట బడ వేయ నీవెగా!'
యనుచు 'సావిత్రి' యెవ్వాని నుతించె?
చెక్కిళ్ళు చిక్కుచు నిక్క దేవుండేల
నని 'శ్యాముడె'వ్వాని కినుకజేసె ?

ఆ॥ వె॥ 'ఎవని పదము సోకకే తన ముత్యాల
భవనము వృథ!' యంచు బల్కె 'బూటి'?
అట్టి షిరిడి విభుడు హత్తుచు 'సాయిరాం'
పత్రిక కిట కొంగు బంగరాత!

సీ॥ ఆధ్యాత్మికౌన్నత్య మతిశయించిన 'సాయి'
తత్త్వ ప్రచార సాధన గడంగి
పార్థసారథిగ "బాపట్ల వేంకట పార్థ
సారథి" సారథ్య భారమూన
మోహనుడై "యాదిపూడి మోహనరావు"
గౌరవ సంపాద కత్వ మెనయ
సాంబశివునిరీతి సాక్షాత్తు "చోడవ
రపు సాంబమూర్తి" నిర్వహణ మందు

తే॥ గీ॥ 'సచ్చిదానంద సద్గురు సాయినాథ'
చరణ సేవక బృందమున్ 'సాయిరామ'
పత్రిక 'చెలువు' గ్రామాన ప్రచురపఱచె
మోహనశివశక్తు లొకట స్ఫూర్తి నింప॥

కం॥ ఆధ్యాత్మిక చైతన్యము
సద్యోవిధి వచ్చుటరిది; చలమున మనుజుం
డుద్యోగించిన సఫలం
బౌ ద్యుమణి విధాన భావనాకాశ గతిన్

తే॥గీ॥ శ్రద్ధగన్పర్చి నిష్ఠతో సాయినాథు
పాదములఁ గొల్వ శాశ్వత పథము దొఱకు
ననెడి సూక్తి పుష్పాల నర్చన మొనర్చి
వెల్గులీను 'సాయిరాం' ప్రభల్ వెలయుగాత!

శా॥ 'సాయిరామ' మహాధిమంత్రమెట నిచ్చల్ ధ్యానమున్ జేయ శ్రీ
సాయిరాము డభీప్సితార్థముల నాస్థన్ దీర్చి భక్తాళికిన్
హాయిన్ గూర్చుచు మోక్షమిచ్చునను సత్యంబున్ బ్రదర్శింపగా
'సాయీరామ్మ'ను పత్రిమిప్పుడరుదెంచన్ సాగి సేవింపుడీ!

* * *

ప్రొఫెసరు:- శ్రీ బొడ్డుపల్లి పురుషోత్తం. గుంటూరు.

ఓమ్ శ్రీ సాయి రామ్

అనే శ్రీ షిరిడి శ్రీ సాయిబాబా తత్త్వ ప్రచార మాసపత్రికను ప్రచురింప నుద్యమించిన మిమ్మల్ని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను.

భక్తిజ్ఞాన వైరాగ్యాలకు కాణాచి అయిన ఈ పవిత్ర భారత దేశంలో కేవలం క్షణికమైన ఇహలోక విషయ విషాన్ని వెలి గ్రక్కే వారపత్రికలు ప్రచురమై అవే విజ్ఞాన సర్వస్వాలుగా చెలా మణి అవుతున్న ఈ కాలంలో శ్రీ సాయి విజ్ఞాన ప్రచార సాధనంగా మాస పత్రిక ప్రారంభించటం అత్యంతానంద దాయకమైన సంగతి.

అంతేకాదు నానాటికి నాగరకుడనిపించు కొంటున్న మానవుడు దానవుడు కంటే హీనుడు కావటం శోచనీయం. పూర్తిగా నర రూప పశువుగా ప్రవర్తిస్తున్నాడు. హింసాప్రవృత్తి అతివేలమవు తున్నది.

ఆధ్యాత్మికోన్నత శిఖరాల నధిరోహించ వలసిన నరుడనే రాజహంస రాబందుగా నీచకంకాళాల మీాదవ్రాలి పొడుచుకుతింటు న్నాడు. ఇటువంటి తరుణంలో శ్రీ సాయీరామ్ దివ్యగాథల్ని, లీలల్ని కాస్తన్న స్మరించుకొంటుంటే అతనిలో క్రమ క్రమంగా కొంత మార్పు రావచ్చు. అందుకే పత్రిక తోడ్పడుతుంది.

మానవుడెంతటి నిరాశాజీవో, అంతటి ఆశాజీవికూడా. ఈ పత్రిక అతన్ని మరింత ఆశాజీవిగా, ఆనంద జీవిగా, ధార్మిక జీవిగా మార్చాలని, అందుకు అనుగుణమైన రీతిగా దాన్ని మీరు తీర్చి దిద్దా లని ఆశిస్తున్నాను.

కేవలం పాండిత్య స్ఫోరకమైన వ్యాసాలు కాకుండా, అనుభవ పచేళిమమైన వ్యాసాల్ని, సిద్ధపురుషులు, భక్తిప్రపుల్ల మూర్తులైన వారినుండి మీరు వ్రాయించుకొని ప్రచురించాలని నేను అభ్యర్థిస్తు న్నాను.

మీ ప్రయత్నంలో మీకు సర్వవిధాల శ్రీ సాయి బాబా అండదండగా ఉండగలడనే నా ప్రత్యయం.

మీ
పురుషోత్తం

ఓమ్ శ్రీ సాయి నాథాయనమః

సందేశము

ప్రపంచ మందంతట ప్రమాదములు, వ్యాధులు, క్రోధాగ్ని యుద్ధజ్వాలలు ప్రజ్వలిస్తూ భయం కంపిస్తున్న ఈ దుందుభి, రుధిరోద్గారి, రక్తాక్షి, క్రోధన అనే దుష్టచతుష్టయము సంఘటింప చేసిన బాధల బారినుండి పరిరక్షించుటకే యీ విజయదశమిన 'ఓమ్ శ్రీ సాయిరామ్' పత్రిక ఆవిర్భవించి మన అందరినీ "శ్రీ రామరక్షా కవచము"గా కాపాడ నున్నది సద్గురు సాయినాధుని "లోకరక్షావాణీ" ప్రతిమాసము అందుకొనుట తెలుగువారి అదృష్టము. "నిష్ట–సబూరి అనే రెండుపైసలు ప్రధాన కానుకగా సమర్పించినవానిని ఎట్టి పరిస్థితి లోను విడనాడను" అన్న వాగ్దానం ప్రకారం ప్రతి సజ్జనుడి ఇంటా, వెంటా, జంటావుండి భగవత్ ప్రభోదములచే Divine protective rays వెదజల్లు "ఓమ్ శ్రీ సాయిరాం" పత్రిక అందరికీ, యావత్ ప్రపంచానికీ (సాయిభాషలో సకల జీవరాసులకు) శ్రీ రామ రక్ష, ఈ కృషికి అన్నివిధముల జయము కూర్చుమని శ్రీ సాయీశ్వరుని ప్రార్థించు చున్నాను.

ఇట్లు, సాయి శరణ్

రెబ్బాప్రగడ వెంకట రాజేశ్వరరావు

అడ్వకేటు–కొవ్వూరు.

'శ్రీ సాయీనాధ బోధామృతము' 643 సూక్తులు భక్తులు తప్పక పఠించాలి.

ఓమ్ శ్రీ సాయీ ప్రసన్న!

'గతిర్భర్తా ప్రభుస్సాక్షీ నివాసశ్శరణం సుహృత్
సమర్థ సచ్చిదానంద భగవాన్ సాయి సద్గురుః'

మహాసమాధి

రచన:— కీ. శే. శ్రీ బాపట్ల హనుమంతరావుగారు

సమ్యగాధీయతే మనోఽత్రేతి సమాధిః— దీని యందు మనస్సును లెస్సగా (పరమాత్మయందు) నుంచఁబడును.

సమాధి హృదయైకాగ్ర్యే - హృదయైకాగ్రత - 'సమాధి' దీనినే "మనోలయ" మందురు.

అష్టాంగయోగములని చెప్పఁబడు (యమము - నియమము - ప్రాణాయామము - ప్రత్యాహారము - ధ్యానము - ధారణము - మననము - సమాధి) వానిలో ఈ సమాధి తుది మెట్టు. ఈ సమాధి రెండు విధములు. (1) సవికల్ప సమాధి (2) నిర్వికల్ప సమాధి. సవికల్ప సమాధియందు మనస్సు, పరిమిత కాలము. కొన్ని నిముషములో గంటలో, దినములో, సంవత్సరములో లయమైయుండి తిరిగి ప్రపంచికాభిముఖమగునది. నిర్వికల్పసమాధి శాశ్వతముగ లయమైపోవుట - దీనినే 'మహాసమాధి' యందురు.

(మన మీ సమయమున శ్రీ సాయిబాబా 67-వ మహాసమాధి మహోత్సవము యావద్భారత దేశమున జరుపుచున్న వారము) కావున ఆ పరతత్త్వమైన బాబా భౌతిక తనువునందుండి కావించిన ప్రతికార్యము తుదకు భౌతిక తనువును పరిత్యజించుటయు మన కెటుల ఆనందోత్సేకములఁ గలిగించి సత్ప్రబోధముఁ గల్పించుచున్నదో తెలిసి కొందము.

మృతి- సమాధి. దేహాత్మబుద్ధి–దేహమే తానను బుద్ధిగల జీవి తనువును విడుచునేని ఆ జీవి మృతినొందెనని యందుము. బ్రహ్మ నిష్ఠులు, యోగవరులగు సాధువులు తనువు విడిచినయెడ వారు 'సమాధి' నొందినారని యందుము. 15–10–1915 రాత్రి M. W. ప్రిధాన్ సతి, స్వప్నమున బాబా భౌతిక తనువు విడిచినట్లు కని ఆ కలలో "అయ్యో! బాబా మరణించినాడే!" అని అనెను. వెంటనే ఆ స్వప్నములోనే బాబా ఆమె యెదుట పొడమి, "అమ్మా! సాధువులు మరణింపరు. సమాధి నొందినారని పలుకవలయును." అని ఆమెకుఁదెలిపెను. ఇతర జీవులకు, సాధు సత్పురుషులకు గల భేదము మనము తెలిసికొనిన మృతి యననేమో, సమాధి యననేమో విశదమగును.

(భగ. గీత. 15-7) అనాదియైన నా అంశమే ప్రపంచమునందు 'జీవ' రూపమై యున్నది. ప్రకృతి సంబంధమై మనస్సుతోఁజేరిన జ్ఞానేంద్రియములు లా జీవిని విషయములనాకర్షించు చున్నది. పరమాత్మయొక్క లేశాంశము (సూక్ష్మాంశము) మాయాకార్యమగు అవిద్య యనెడి ఉపాధి సంపర్కముచే 'జీవుడు' అని పేరు నొంది కర్తృత్వ-భోక్తృత్వాది వికారరూపమగు సంసారమునందు ప్రవేశించి భ్రమనుజెందు చుండును. స్వస్వరూపజ్ఞానము కలుగు వరకు ఈ సంసార విభ్రాంతి తొలఁగదు. ఆ అవిద్య అను ఉపాధి తొలఁగిన జనన మరణాత్మకమగు సంసార పరిభ్రమణ మాజీవికి లేదు. "యద్గత్వా న నివర్తంతే"– దేనిని పొంది తిరిగి జన్మింపరో ఆ స్థానమును ఆ యోగి, సాధు సత్పురుషుఁడు పడయును.

ఆ వ్యాజకరుణా సింధువగు భగవానుఁడు జనన మరణాత్మకమగు ఈ సంసార పరిభ్రమణముకఁ జిక్కుపడి పరితపించు జీవుల నుద్ధరించి సాయుజ్య ప్రాప్తిఁ గూర్చుటకై యీ విశ్వమున నొక దేశ

మునే కాదు- ఒక కాలమునే కాదు. ఎల్లదేశముల నెల్లకాలముల నవతరించుచునే యుండును. అవతరించుటయన, దైవత్వమునకందు బాటగు దైవత్వము మానవునకందుబాటగు మానవత్వమును గలిగి యీ ప్రపంచమునఁ బొడముటయే. అట్టి వ్యక్తిని అవతారమనిన, సత్పురుషుఁడనిన, సద్గురువనిన, ఒకటే. నిర్గుణుఁడు, నిరాకారుడు, సర్వవ్యాపియైన, దైవమును మానవుఁడు తెలిసికొనలేఁడు. అట్టి వస్తువును గూర్చి యెవరెన్ని విధములఁ దెలిపిన మానవునకు ప్రయోజనము లేదు. దేశకాల కారణాతీత మైన ఎఱుక, అపార శక్తిసంపదలు జగత్కల్యాణ గుణములు గలిగి మానవున కందుబాటులోనున్న వస్తువునే మానవుఁడు కోరును.

సంసృతి బంధములఁ జిక్కువడి పరితపించు మానవునకుఁ వలసినది కష్టనివృత్తి, అభీష్టప్రాప్తి. ఎల్లర ప్రార్థనలను జగజ్జననివలె నాలకించి కరుణించి యనుగ్రహింప సకల సమర్థతలు గల అవలంబనమెచటఁ గలదా?-యని మానవుడు నిరీక్షించుచుండును. కాళ్ళపైఁ బడి యేడ్చి తన సంకటములఁ దెలుపుకొనిన సమాలించి లౌకిక పారలౌకిక సుఖసంతోషములఁ బ్రసాదింప దక్షుడైన తండ్రి ఊహామాత్రము కాదు. కనుటకు, తాకుటకు, చెప్పుకొనుటకు, ఏడ్చుటకు అందుబాటైన వ్యక్తి మానవునకు కావలయును. అట్టి ఆపదుద్ధారకుని కొఱకు మానవుఁ డన్వేషించును. ఈశ్వరానుగ్రహము, పురాకృత సుకృతము గలవాఁడు అట్టి సద్గురువును పడయఁజాలును.

మానవ జన్మము – విశిష్టత :

సృష్టిలోని జీవరాశులలో మానవజన్మ ముత్తమోత్తమమైనది. వీనికి వివేకము, యుక్తాయుక్త పరిజ్ఞానము భగవానుఁడు ప్రసాదించినాడు. దాని నాధారముఁ జేసికొని, దైవీసంపదలను పెంపొందించుకొని, తనలోని యీశ్వరాంశను క్రమక్రమముగ పెంపు జేసికొని

పరమాత్మ సాయుజ్యము పడయుటో లేక కామక్రోధాదులకు లోఁగి అధోగతి, తిర్యగ్జన్మములను బడయుటో మానవునకుఁ బ్రాప్తించుచుండును.

[భగ. గీత.7–19.] జీవి అనేక జన్మములెత్తి యీశ్వరానుగ్రహమున సాధుసత్పురుషుల సేవలచే సుకృతపరిపాకము నొంది యీ సకలము వాసుదేవుఁడు అని గుర్తించి యా పరతత్త్వమునకు ఆత్మసమర్పణము గావించును. అట్టివారు చాల అరుదుగ నుందురు. లోకమున బ్రహ్మనిష్ఠులు మహాత్ములైన సాధుసత్పురుషులు రెండు తెగలు. ప్రాపంచిక సంబంధము విడిచి కేవల బ్రహ్మనిష్ఠులై నిర్వికల్ప సమాధి యందుండి ఆత్మానందమనుభవించు వారొక తరగతి. వీరు ప్రపంచమునసే జీవులతో ప్రత్యక్ష సంబంధముఁ గల్పించుకొనరు. కాని వారి ప్రేమరస ప్రవాహము విశ్వమంతట వ్యాపించుచునే యుండును. సన్మార్గవర్తులగు వారలను వారనుగ్రహించుచునే యుందురు. అట్టి పరమ సాధువరేణ్యుల యునికి చేతనే విశ్వమున ధర్మ సత్యములు [రామాయణమున ప్రతిపాదితమైన ధర్మము – భగవద్గీతలందు నిరూపింపఁబడిన సత్యము] సుస్థిరములై యున్నవి.

సద్గురువులు :

ఇఁక రెండవ తరగతివారు "స తరతి స తరతి లోకాంస్తారయతి" తాను తరించి, ఎల్ల ప్రాణులఁ దరింపఁ జేయు సమర్థుఁడగుచున్నాఁడు. ఇట్టి సమర్థ సద్గురువు బ్రహ్మసూత్రములందు [III-3-37] దెలుపబడిన 'అధికారి' – పురుషుఁడు లేక అవతారము, అని చెప్పఁబడుచున్నాఁడు. ఇట్టివారు ప్రపంచమున మెలఁగుచున్నట్లు గోచరించినను వారు సదా బ్రహ్మనిష్ఠులే. వారిని లోభపఱచు వస్తువేదియు లేదు. అట్టి సద్గురువు జగదంతర్యామియై చరించును. ఆ మహనీయుఁడు కర్మములను జేసినను చేయనివాఁడే.

(భగ. గీత. 3-22) ఈ మూడు లోకములందు వారు పొందనిది కాని, పొందుటకుఁ దగినదిగాని లేకపోయినను వారు కర్మముల (లోక సంగ్రహార్థము) నాచరించు చుందురు.

"భగవంతుని సేవకులు (ప్రతినిధులు) పలువురు గలరు. వారలకతి విస్తృతములైన మహిమలు కలవు, వారిలో నేను ఒకఁడను" అని బాబా తెలిపినాఁడు. (నా. బో. 90) వీరందఱు భిన్నులా? అను సందేహము వలదు. వీరందఱు నేమే ఈ విశ్వమునఁ బొడమిన ఏ అవతారమును ఏ సమర్థసద్గురువును, ఏ సత్పురుషుని మానవుఁడు (జీవి) సమాశ్రయించినను భగవానుని ఆశ్రయించిన వాఁడే. ఈ సత్పురుషులు ప్రపంచమున బొడముట మానవోద్ధరణము తద్వారా సకల జీవోద్ధరణకొఱకే. బాబా నానాసాహెబ్ చందోర్కరుతో నాలుగుజన్మములనుండి తనకుసంబంధము గలదనియు, జి.జి. నార్కేను 30 జన్మములనుండి యెఱుగుదుననియు, శ్యామాతో 72 జన్మముల నుండి కలిసియుంటి ననియుఁ దెలిపినాఁడు. ఇన్ని జన్మముల నుండియు చందోర్కర్, నార్కే, శ్యామా, బాబాలుగ జన్మించినారని భావము కాదు. ఆయా జీవులే యవతారపురుషుని, ఏ సద్గురువును, ఏ సత్పురుషు నాశ్రయించినను బాబాను (దైవమును) ఆశ్రయించినవారే. కావున బ్రహ్మజ్ఞులైన సద్గురువులలో భేదము లేదు. అందరు అహాంతరాత్మయే. 'చత్తే బోత్తే దేవ్'- తిరుగుచు పలుకుచుండు దైవమే. దైవమునకువలె వారల యెఱుక దేశకాల కారణాతీతమైనది. బ్రహ్మము దైవమునకెట్టి శక్తిమహిమలు కలవో సమర్థసద్గురువులకు అట్టి మహిమలు కలవు. కాని వానిని విచ్చలవిడిగా ప్రదర్శింపరు. ఆయా ఆశ్రితులగు జీవులెంతమాత్ర గ్రహింపఁజాలుదురో అంతమాత్రమే ప్రదర్శింతురు, వారు "నీరుకొలది తామర" వంటివారు. సమాశ్రయించిన జీవి, మానవుఁడు ముందడుగు వేయుటకు ఎంతదనుక వెలుగు ప్రసరింపఁదగునో అంత మాత్రము ప్రసరింపఁ జేయుదురు. సమర్థ

సద్గురువు ప్రవర్తనము సర్వేశ్వరుని లీలల కనుగుణ్యముగ నుండును గాని విరుద్ధముగ నెప్పుడు నుండదు.

“పారసమే అరుసంత మే—బహుత అంతరోజాన
వహలోహాకంచన కరై—సోకరై ఆపసమాన”

పరుసవేదికి సత్పురుషునకు చాల భేదము కలదు. పరుసవేది తనను జేరిన లోహమును బంగారము జేయును సత్పురుషుఁడు తన నాశ్రయించిన మానవుని తనకు సమానునిగఁ జేయును. (“ఆపనా సరికా కరితతా, ల్”) సద్గురువు ‘సూదంటురాయి’ వంటివాఁడు. తనను జేరిన లోహశకలములను సూదంటురాయి క్షణములో తన చక్కఁ గాకర్షించుకొని దానికిని తన శక్తిఁ గలిగించును. స్వర్గాపవర్గ సుఖములను క్షణకాలమేని సత్పురుషుని సమాగమముతో సమములు కావు. సత్పురుష సమాగమము, దుర్లభము అగమ్యము, అమోఘము. అట్టివారి అనుగ్రహము గలుగుటయు సర్వేశ్వరుని కృపయే యగును.

“అబమోహి భా భరోసహానుమంతా !
బిను హరికృపామిలహి నహి సంతా”
[తులసీ రామచరితమానస్]

సాయిబాబా యోగ సంపూర్ణావతారము :

ఈ ప్రపంచమునఁ బొడమిన అవతారములు, ప్రవక్తలు సత్పురుషులు సద్గురువులనుగూర్చిన వృత్తాంతములు, వారు వారు కావించిన బోధలు వివిధభాషాగ్రంథ రూపములలో కోకొల్లలుగ గలవు. వివిధమతానుయాయులగు మానవులందుఁ గల విద్వేషాసహిష్ణతల నిర్మూలించి సామరస్య సమన్వయ భావములఁ బెంపొందించి విశ్వమానవప్రేమ, భూతహితాసక్తిఁ గల్పించుటకే ఆ సర్వేశ్వరుఁడు సాయినాథుఁడుగ అవతరించినాడు.

ఎవరెవరే యే భావములన నన్ను సేవింతురో వారివారి ఆ యా రూపముల ననుగ్రహింతునని, (భ. గీ. 7-౩) తెలుపబడినట్లు,

ఇన్ని విధముల మానవులు ఆశ్రయించి సేవించునది నన్నొక్కనినే అని బాబా నిరూపించి శ్రీరామ, శ్రీకృష్ణ, శంకర, దత్త, గణపతి, హనుమాన్ మొదలగు రూపములు తానేయగునట్లు ఆ యా భక్తులకుఁ బ్రదర్శించినాడు. [సాయిబాబా చరిత్రమును చూడుము]

బాబా సర్వాంతర్యామి :

'సాయి' - అన మూడున్నర మూరల మానవ తనువు గలిగి ద్వారకామాయి మసీదులోఁ గూర్చున్న వ్యక్తి యని మీరు భావించు చున్నారా?- అది పొరపాటు. నేను లేని తావులేదు. నేనే విశ్వ మునందంతట వ్యాపించి యున్నాడను" -అని బాబా పలికినాఁడు. పలుకుటయేకాదు. తా నెట్లు వ్యాపించియున్నది తన భక్తులకు వారి వారి అనుభవముల నెఱుక పఱచినాఁడు. ఏ జీవిని ద్వేషించిన, దూషించిన, బాధించిన, హింసించిన తాను బాధపడినట్లు తనవారికిఁ దెలియఁబఱచినాఁడు. ఏ జీవికి సహాయముఁ జేసిన, తినఁబెట్టిన ఆదరించి నఁదాను సంతృప్తి, సంతుష్టి పొందినట్లు తన బిడ్డలకు నిరూపించినాఁడు. నిత్యము భగవద్గీత లందు-

> " ఎవఁడు సకలంబునందు వీక్షించు నన్ను
> ఎవఁడు నాయందు సకల మీక్షించుచుండు,
> జగతి వానికి నేఁ బరోక్షంబు నొంద
> వాఁడుఁ నాకుఁ బరోక్షంబుఁ గాఁడు: పార్థ ! "

[భ. గీత. 6-30]

అని వల్లించుచున్న లాభము లేదని, తనను సకల భూతాంత ర్యామిగా చూడ నేర్చినవాఁడే తనకుఁ గూర్చు భక్తుఁడని బాబా ఋజువు చేసినాఁడు.

బాబా - సగుణ – నిర్గుణ – బ్రహ్మము.

సాయిబాబా ప్రాకృత మానవునివలె వర్తించుచు షిర్డియందు ద్వారకామాయి మసీదున నేక దేశ గతుఁడైనవాఁడు నిర్గుణుఁడు నిరాకారుఁడు. సర్వ వ్యాపి యెట్లగును? అను సందేహము బాబా భక్తులై స్వకీయానుభూతి లేనివారికిఁ గలుగ వచ్చును. బాబా "మై అల్లాహూ!" అనిన మాట ఊరక తన ఘనత కొఱకు పలికిన మాటకాదు. చిత్తవృత్తి విలయము చేయక సత్యతత్త్వము నెఱుగక 'అహం బ్రహ్మ' 'బ్రహ్మోస్మి' అనువాఁడు లోకవంచకుఁడు. బాబా తాను సర్వభూతాత్మ, భూతాత్మగా, సర్వాంతర్యామి – అంతర్బహిశ్చ తత్సర్వము తానుగా, పలికిన మాటలు అవి అని సోదరీ సోదర భక్తులు గుర్తింపనగును.

అర్కబింబ మొండొకట ప్రత్యక్షముగను
వర్తులాకృతిఁ గల్గి విశ్వంబు వెలుఁగు
నొందఁజేయుచునుండుఁ దానొక్క మొగిన
నెల్లరకు నెల్లెడల గాన్పింపకున్నె?
కాన నేక దేశగతుఁడైన రూపస
మేతుఁడైనఁగాని, యినుని మాడ్కి
సర్వగతుఁడు మఱియు సర్వాత్మ సచ్చిదా
నందమయుఁడు సాయినాథుఁడెపుడు.

1918కి పూర్వమే కాదు. తరువాత నేటికిని ఏనాటికేని త్రికరణ శుద్ధిగ సమాశ్రయించి, లౌకికకాంక్షతోఁగాని, పారలౌకిక కాంక్షతోఁగాని బాబాను సేవించు భక్తుల ప్రార్థనల సమాలించి విశ్వజననివలె బిడ్డలనాదుకొని ఏడుగడయై రక్షించుట విదితము. బాబా అనిన చిచ్ఛక్తి. క్రియాశక్తి, ప్రేమశక్తియని బాబా బిడ్డలు గ్రహించినారు. అంతయేకాదు. తమ హృదయాంతరస్థాయియై తమ ఆత్మలోని ఆత్మయై తమ మనో బుద్ధులను ప్రేరేపించి సకలకార్య

ములఁ బ్రవర్తింపఁజేయుచున్న వస్తువు 'సాయి' యనియే గుర్తించినారు. కావున 'సాయి' తన ఆత్మ అనియే ప్రతి భక్తుఁడు గుర్తింపదగును. "అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః"

[భ.గీ. 10-20] అనిన భగవానుని వాక్కు స్మరింపఁదగును.

"సర్వస్య చాఽహం హృదిసన్నివిష్టో [భ. గీ 15-14] అఖిల భూత హృదయముల యందు నుందుననియే భగవానుఁడు తెలిపినది.

" ఎందువెదకెద వీవు? నీయందయుంటి.
వెదక నేర్తువేని దృటిలో లభించువాఁడ,
లేను గుడియందు మసీదులోన లేను,
కాశియందుఁ గైలాసానఁగాని, యాయ
యోధ్యనేని ద్వారవతి నేని నుండఁబోను
ఎందు విశ్వాసములరు నే నందునుందు "

గురుభక్తి - విశ్వాసబుద్ధి :

బాబా తన బిడ్డలనుండి యేదియు మఱుఁగు చేసిన వాఁడుకాఁడు; తాను ఆస్థితికి యెట్లు రాఁగలిగినది వివరముగ పలికినాఁడు. [రాధాబాయి 'దేశముఖ్' వృత్తాంతము గమనింపుఁడు] "నేను నా గురువును పండ్రెండు సంవత్సరములు సేవించితిని. నా ప్రాణములు నా దృష్టియందు నా దృష్టి నా గురువునందు దవిలియుండెడిది. నా గురువు నా కెట్టి మంత్రతంత్రోపదేశములను చేసియెఱుఁగడు. కృపాకటాక్షము మాత్రము ప్రసరించువాఁడు. నా తల శుభ్రముగ గొఱిగించి [ఎల్ల తలంపుల నిర్మూలించి] రెండు కానుకలు నా వలన ఆర్జించినాఁడు. అవి 1. నిష్ఠ - [గాఢ విశ్వాసము] 1. సబూరి (ధైర్యముతోఁ గూడిన ఓర్పు). ఆ రెండు కానుకలు సమర్పించితిని. "ఆమాచా ఘరాణె నిరాళా ఆహె " - మా సాంప్రదాయములు ప్రత్యేకములు. " మీకానాలా దుస్నారా గురునస్తే " నేను చెవికొఱకు

గురువుకు (చెవిలో మంత్రోపదేశములు చేయువాఁడు) - కాను." అని తెలిపి, ఆరు శాస్త్రములు, సాధన చతుష్టయముల నభ్యసింప వలసిన పనిలేదు. "చాలు గురునందు భక్తి - విశ్వాసబుద్ధి" - అని రూఢిగ బాబా తెలిపినాఁడు. ఈ మాటలే హేమాద్రిపంతువకు నాటఁ బలికినాఁడు. బాబా మనకుఁగావించిన యీ బోధ ప్రతిభక్తుఁడు నిత్యము స్మరింపదగినది.

మానవుని పురోగతికి ప్రతిబంధకము - దేహాత్మ బుద్ధి :

ఏ కారణము చేతనైననేమి మానవుఁడు దేహమే తాను' అను బుద్ధిగలవాఁడగుట స్వపరభేద భ్రాంతి నొందు చున్నాఁడు. ఈ భ్రాంతి చేతనే కామక్రోధాదులు, భయము మొదలగునవి కలిగి యున్నాడు. ఈ దేహధారణ పోషణాకులకై వివిధ కామితములకు లోఁగి ప్రయాస పడుచుండును. అధ్యాత్మిక జిజ్ఞాసులైనవారికి బాబా తన శరీరమొక గృహమని తెలిపినాఁడు. కొలిమిలో బడిన కమ్మరి బిడ్డను రక్షించుటకై బాబా తనచేతిని మసీదులో 'ధుని'లో జొనిపినాఁడు. చర్మము కాలినది. భక్తులు కాలిన చేతికి కట్టుకట్ట బోయినపుడు "నాయీ శరీరమును చితిపై పెట్టి కాల్చుచున్న నేను వినోదముగఁ జూతును" - అనినాఁడు.

'ఈవు చూచునట్టి ఈ శరీరంబొక
గృహమటంచు నీవు నెఱిఁగి కొనుము!
ప్రేమ నా గురుండు వేంకుశుం డెప్పుడో
యెత్తుకొనుచుఁ బోయె నింటనుండి" అని పలికినాఁడు.

1886న 72 గంటల సమాధియందు బాబా తనువు విడిచి 3 దినముల తరువాత మరల తనువున ప్రవేశించినాడు.

"వాసాంసి జీర్ణానియథావిహాయన వానిగృహ్ణాతి నరోపరాణి" చినిగిన వస్త్రమును విడిచి క్రొత్తవస్త్రమును నరుఁడు ధరించునట్లు

[భ. గీ. 2-22] [' జీర్ణవస్త్రసమం పశ్యన్ త్యక్త్వా దేహం ప్రవిష్టవతే ' – నామావళి చూడుడు] అని బాబా ప్రదర్శించి, ఆత్మ నిత్యుఁడు–సర్వగతుఁడు – స్థాణువు–అచలుఁడు–సనాతనుఁడు అని తన వారికి ప్రబోధ కల్పించినాఁడు. 1886లో ఆ మూఁడు దినములు బాబా ఉన్నవాఁడో లేనివాఁడో భక్తులు విచారించుకొనఁదగును. బాబాకు శరీరమున్నను లేకున్న నొకటే. స్వేచ్ఛానుసారముగ తన తనువును విడువ గలఁడు. కావున 1918లో మహాసమాధియందును బాబా యెక్కడకు పోలేదు. 1886లో బాబా ఆ మూఁడు దినము లెక్కడున్నాడో 1918 అక్టోబరు 15 తేదిన కావించిన మహాసమాధి తరువాత నేడు, ఇకేనాఁడు బాబా అక్కడే యున్నాడు. అనగా సర్వవ్యాపియై యున్నవాఁడు.

బాబా అభయ ప్రదానములను పరిశీలింపుఁడు.

" తనువు గలిగిన లేకున్న దాననేమి?
తనువు విడిచితి, నైననన్ననఁగలారు;
కనుడినను;– నేమఱక మిమ్మెఁగనుచు నుందు
దలచికొనిన మాత్రమునఁ జెంతనవసింతు."

అని అభయమిచ్చినాఁడు.

సాయిబాబా – చమత్కారములు – లీలలు. : సాయీ ప్రభువు ప్రదర్శించు అద్భుత లీలలు – చమత్కారములు అన్నియుఁ దనవారికి జూపు ఎరలు. ఇందఱము బాబాను సమాశ్రయించి అనుసరించి సేవించుచున్నారమే బాబా యిందఱ భారముల నేరీతి మోయ గలఁడు? – అని సందేహించు తన భక్తులకు ధైర్య స్థయిర్యముల సమకూర్చి సందేహ భయభ్రాంతులను నివారించి, బాబా ఆశ్రయమున లౌకిక పారలౌకిక భయలాఘవ హానులు లేక మనము పురోగమింప గలము- అను దృఢవిశ్వాసము పాదుకొలుపుటకే ఆ తండ్రి తన

లీలలను ప్రదర్శించినాడు. బాబా అన్నము మెతుకులు వెదజల్లు వాడు. కాకులు మెతుకులను దినుచున్నవి. హంసములు ముత్తెము లను మెసవు చున్నవి.

బాబా అభయ ప్రదాత :

అవతారములు, సత్పురుషులు, సద్గురువులు భగవానుని దయా స్వరూపులు. అట్టి అవతార మూర్తుల సమాశ్రయించి సేవించు మానవులకు ఈ జన్మమున గాకున్న మరుజన్మము నందైన సిద్ధి కలిగి తీరును. వారి ఆశ్రయము దైవీ సంపదలలో ముక్తాను భూతులలో ప్రథమభాగ్యము. ఉపనిషత్తులలో ప్రతిపాదితమైనది. "నబిభేతి కుతశ్చన" - "అకుతో భయత్వము" - ఇహపరములందు దేనిని గూర్చి భయము లేకపోవుట సిద్ధించును.

ఎప్పుడేని శరణాగతి జేసి "నేను నీ వాడను" అని యాచించు సకల జీవములకు అభయము ప్రసాదింతును. ఇది నా వ్రతము అనిన త్రేతాయుగమునాటి శ్రీరామచంద్రుడను నేనే.

అనన్యభక్తితో నన్నుపాసించు వారి యోగక్షేమముల భారము వహింతునని అభయము ప్రసాదించిన ద్వాపరయుగ శ్రీకృష్ణుడను నేనే యని తెలుపుటకు: ఈవిశ్వమునకు ఆధారభూతుడు, సర్వ నియంత సర్వజ్ఞుడు సర్వవ్యాపి. తన యిచ్ఛాను సారముగ సకలము ప్రవర్తింపఁజేయు 'కర్త' సర్వసాక్షియగు వాఁడున్నాడా? లేడా? యని సందేహించు భౌతిక వాదులగు మానవులకు 'ఉన్నాడు' 'ఉన్నాడు' అని నిరూపించుటకే భగవానుఁడు శ్రీ సాయీ బాబాగా అవతరించి

" ఇచట నేనుండ నీఁక భయమేల? విడుము—
నీ బరువుల నాపై, నేన నిర్వహింతు
నన్ను గనుము! వేకన్నుల నిన్నుఁ గందు:
శ్రితుని నిన్నెప్పుడే నుపేక్షింతునేమి!

"క్యా! తుఝే ఉపేక్షా కర్తాహూం"- ఏమీ నిన్ను ఉపేక్షింతునా? అని ఘంటా పథముగఁ బాబా పలుకుచున్నాఁడు.

సాయీబాబా — మహాసమాధి :

15-10-1918న బాబా మహాసమాధినొందినాడని మనము తలంచుచున్నారము. బాబా 'అహం తరాత్మ' అని మనము గుర్తించదగును. అనగా ఆకారము ధరించిన 'అంతరాత్మ' యని అర్థము. 15-10-1918 వరకు నీ అంతరాత్మ ఏకదేశగతు డైనట్లు గోచరించియు సర్వవ్యాపియై ఎట్లున్నాడో బాబా ప్రకటించినాఁడు. 11-5-1936న మేనేజరు సతీమణి పూజ్యశ్రీ బి. వి. నరసింహాస్వామిగారికి తెలిపిన విషయము గమనింపుడు." .... ఒకటి సాయిబాబా యను ప్రాకృతస్థితి యందుండి తన నాశ్రయించు జీవుల లౌకిక పారలౌకిక విషయముల గుర్తించుచుఁ దోడ్పడుచు- మఱియొకటి సర్వభూతాత్మ-భూతాత్మ స్థితి సచ్చిదానందస్థితి యందుండును. అట్టి ద్వివిధములగు స్పృహాల కనుగుణ్యములగు శక్తి సంపదల ప్రతి క్షణము నిర్వహించుచు ప్రవర్తించుచునే యుండును. ....

(Devotees Experienses)

1918 యందు మన దృష్టిపథమునుండి బాబా భౌతికతనువు తొలగినది. మిగిలినది నిర్గుణతత్త్వము ఆ తత్త్వము 'సాయీ' అభిధానమున అలరారుచున్నది. 1918 పూర్వము ఆవస్తువ యెక్కడను న్నదో యీనాడు ఇకేనాడు అచటనే కలదు. ఉండును, ఆ వస్తువును మనదటి కాకర్షించునది, బాబాను మన కందించునది 'సాయీ' అను అక్షరద్వయము, ఇదియొక స్విచ్, మన హృదయమును, 'బల్బు' ను ద్వారకామాయిఁగావించుకొని 'సాయీ' నామమను 'స్విచ్' నొత్తితిమా సర్వ వ్యాప్తమైన 'సాయీ' విద్యుత్తు మన హృదయమునఁ బ్రకాశించును. సర్వవ్యాప్తమైన నామిని నాకర్షించి మన యధీనము చేసికొన సమర్థమైనది నామము 'సాయీ' ద్వ్యక్షరి.

భగవద్గీతయందు శ్రీ కృష్ణుడు అర్జునునకుఁ గావించిన చరమ బోధను గమనింపుడు,

[భ. గీ. 18–61–62] సకల భూత హృదయములందు సర్వేశ్వరుఁడధివసించి, యీ దేహయంత్రములను ప్రవర్తింపజేయు చున్నాడు. సర్వభావముల ఆ వస్తువునే శరణు పొందుము. ఆ స్వామి అనుగ్రహమున పరమశాంతి శాశ్వతపదము బడయఁగలవు- అని బోధించినాడు. కావున మన హృదయస్థాయియైన శ్రీకృష్ణసాయిని సర్వభావముల శరణొంది ఆ తండ్రి యనుగ్రహమున పరమ శాంతి, శాశ్వత స్థానము (బడయుదము.

మన హృదయస్థాయియైన సాయి సాకారుఁడై ద్వారకామాయి మసీదున దర్శనమిచ్చుట మన మనస్సును వెలుపలనున్న సద్గురువునందు లగ్నము చేయుట కవకాశము గల్పించుటయే. శ్రీసాయీ సద్గురువు వెలువలనున్నట్లు మనకు గనబడుచున్నను మన హృదయమున నున్నవాడే. లేనియెడ మన తలంపులను, పలుకులను, పనులను బాబా యెట్లు తెలిసికొనువాడు? కావున మన వెలుపల గనబడుచున్న సద్గురువే మన హృదయాసీనుడై యున్నవాడని స్పష్టమగుచున్నది. బాబా ఎక్కడకో వెళ్లినాడు, ఎక్కడో యున్నవాడు అని తలంచ వలసిన పనిలేదు. బాబా మనలో నున్న వాడు కావుననే ఎవనికి వాడు 'నేను' ఉన్నాను అని తలంచుచున్నాడు. బాబా లేనిచో 'నేను' వస్తువయు లేదు.

'నేను' న్న దనుకఁ గన్పింపఁడు గురుఁడు
'నేను' లేదు, గురుండు నెగడుట నిపుడు:
అరయఁగ నొక రాజ్యమందు న ఱేడు
లిరువురుంట బొసంగ దేమొ? యేనాఁడు.

బాబా లేడని తలంచు వానికే 'దురహంకారునకే నేను' – ఉన్నాఁడు. తనలో నుండి, తన దేహ 'యంత్రమును ప్రవర్తింపఁ జేయుఁవాడు బాబా అని గుర్తింపఁజాలినవానికి 'నేను' – అను వస్తువు లేదు. 'నేను' ఉన్నాను అను భావము స్ఫురింపఁజేయు నతఁడే– శ్రీ రామసాయి. కావున సోదరీ సోదర భక్తులు ఎవరికివారు ఈ పరమ రహస్యమును గుర్తించి, విశ్వసించి సర్వవిధముల ఆ అహంతమ – 'నేను' అను భావమును హృదయ స్థాయియైన శ్రీ సాయీరాము పదాంకితము జేసి, పరమ శాంతి శాశ్వతస్థానము బడయుదము గాక ! శ్రీసమర్థ సచ్చిదానంద సద్గురు శ్రీసాయీ మహా ప్రభువు మన కందఱకు అట్టి సద్బుద్ధిని, సద్భక్తిని ప్రసాదించుగాత మని ప్రార్థించు చున్నాఁడను.

శ్రీ సా యీ స మ ర్థ!

నా తొలి షిరిడి యాత్ర

ఓమ్ శ్రీసాయిరామ్ – శ్రీ సాయీప్రసన్న

1957 సంవత్సరం ఫిబ్రవరి 15వ తేదీన ఉత్తర దేశయాత్రకు భీమవరం నుండి బయలు దేరిన పూర్తియాత్రా రైలు విజయవాడ, హనుమకొండ, హైదరాబాదు చూచుకొని ఫిబ్రవరి 21 ఉదయం కోపరగామ్ చేరినది. నా కుటుంబముతో యాత్రికులు సుమారు 350 మందిమి అచట నుండి బస్సులపై షిర్డి ఉదయం 8 గంటలకు చేరినాము. షిర్డిలో ఎవరో ఒక సాధు–పుంగవుడు ఉన్నాడని ఆయనను దర్శించుటకు వెళ్ళు చున్నామని తలంచినాము. స్నానములు చేసి సమాధి మందిరమునకు వెళ్ళినాము. శ్రీ సాయినాథుని నిలువెత్తు

పాలరాతి విగ్రహమును, సమాధిని దర్శించినాము. ఆనందముతో కన్నులు చెమ్మగిల్లినవి. శ్రీసాయినాథునకు పూజలు చేసుకొని ప్రసాదములు తీసుకొని ఉదయం 10 గంటలకు తిరిగి కోపర్‌గామ్ బయలుదేరు చుండగా మా రైలు పెట్టెలోనే ప్రయాణము చేయు చున్న ఒక రిటైర్డు ఇంజనీయరు శ్రీ పి. ఆర్. కె. నాయుడు గారు స్నానపు గదుల వైపు వెళ్ళుచుండగా "ఎందులకు వెళ్ళు చున్నారని" అడిగినాను. "బంగారపుగొలుసు గల నారిష్టువాచి మరచి పోయినాను. వెతుకుటకు వెళ్ళుచున్నానని" చెప్పగా మా కుటుంబమును మిగిలి యాత్రికులతో కోపర్‌గామ్ పంపి నేను వారితో వెతుకుటకు వెళ్ళి నాను. ఎంత వెతికినా అది కనుపించలేదు. అంతలో సమాధి మందిరములో మధ్యాహ్న హారతి ప్రారంభించిరి. మేము సంస్థాన ఆఫీసు లో వాచీని గూర్చి వాకబు చేయగా మాకు ఎవ్వరు యివ్వలేదనిరి. మేము వుభయులము హారతిలో ఆనందముగ పాల్గొని వైకుంఠ వాసుని సన్నిధిని వున్నట్లు ఆనందించినాము. ప్రసాదము తీసుకొని వస్తూ సంస్థాన ఆఫీసులో నేనే తిరిగి వాచీని గూర్చి అడుగగా" ఇది మీదే మో చూచు కొనండి. ఇప్పుడే ఎవరో స్నానపు గదిలో మరచి పోయి నారు, వస్తే యిచ్చి వేయండి. అని వొక ముసలి సాధువుయిచ్చినాడు" అని చెప్పిరి. అది నాయుడు గారిదే. శ్రీసాయినాథుడే స్వయముగ తెచ్చి యిచ్చినారని ఆనందించినాము. మేము యిరువురము నింబవృ క్షము [శ్రీసాయి తపస్సు చేసిన చోటు] సావిడి, శ్రీ ద్వారకా మాయి ఖండోబా దేవాలయము దర్శించి తరిగి కోపర్‌గామ్ వస్తు వుండగా నాయుడు గారు "నా మోకాలుపై పెద్ద పుండు [రణము] బయలుదేరి 2 సంవత్సరముల నుంచి చీము, నెత్తురు కారుచు ఎంత వైద్యము చేసిన తగ్గుటలేదు. ఒకనాటి రేయి అనగా 15 రోజులక్రితం స్వప్నములో నాకు ఒక సాధువు దర్శన మిచ్చి నా భక్తురాలు "కృష్ణప్రియ" రామచంద్రాపురములో కలదు. ఆమెను దర్శిం చుము అని చెప్పెను. నేను ఉదయం కృష్ణప్రియను దర్శించి నాను.

నీవు షిరిడి వెళ్ళి శ్రీసాయిబాబాను దర్శించిన నీపుండు మానునని ఆమె చెప్పెను. అందుకై బయలు దేరినా” నని చెప్పిరి. ఆమరునాడు రైలులో ఆయన కట్టు విప్పగా రణము మాయ మగుటమే కాక ఆన మాలు కూడ లేకుండ పోయెను. మేము యిరువురము ఆమితా త్సర్యముపొంది శ్రీసాయీశ్వరుడు సాక్షాత్తు భక్తరక్షా పరతంత్రుడు అగు శ్రీ భగవానుడే అని పూర్తిగా నమ్మినాము.

“ నా భక్తులను పిట్ట కాళ్ళకు త్రాళ్ళు కట్టి పిల్లలం లాగినట్లు ఏదో నెపమున నాదర్శ చేర్చుకొని ఆదరింతురు” అని శ్రీ బాబా వారు పలికిన త్రికాల సత్యము- అనుభవ పూర్వకమని ఆనందించి నాము. కనుక “శ్రీసాయిరామ్” నామము సదా స్మరణీయము.

ఓం శ్రీసాయి సమర్థ !

శ్రీ పొదిల విశ్వనాధశర్మ
యస్. ఇల్లిందలపర్రు.

ఓమ్ శ్రీ సాయినాథాయనమః

సద్గురువు — సర్వాత్మకుడు — మన సాయిబాబా

“ గురుబ్రహ్మా గురుర్విష్ణో గ్గురు ర్దేవో మహేశ్వరః
గురుర్సాక్షాత్పరబ్రహ్మమ్ తస్మై శ్రీగురవేనమః ”

అన్న ధ్యానశ్లోకం గురువే త్రిమూర్త్యాత్మకుడని పరబ్రహ్మ స్వరూపమని తెలియ జేస్తుంది. అజ్ఞానమనే చీకటిని తొలిగించి జ్ఞానమనే వెలుగును మనలో నింపి మనమెవరో మనకు తెలియబరచే వారే సద్గురువు. అలాంటి సద్గురువు దైవస్వరూపుడే. గురువే దైవం యెలాగౌతాడు? అసలు దైవమంటే యెవరు? ఆదైవం ఉన్నాడా? లేడా? అనే అనుమానాలు సాధారణంగా యెంతో మందిని

వేధిస్తూనే ఉంటాయి. దేహాత్మ భావనలో చిక్కి సతమతమౌతున్న సాధారణ సాధకులకే సమస్య సద్గురు కృపవల్లకాక అన్యవిధంగా తొలిగే ఉపాయం లేదనే చెప్పకోవాలి.

నిజమైన అవసరం గలవాడు తనవద్దనున్న సొమ్ము చెల్లించి అవసరమైన వస్తువును కొని తన పనిపూర్తి చేసుకొని ఫలితం పొందుతాడు. అలాకాక ఉబుసు పోకకు ఉత్తజేబుతో బేరంచేసే వాడు కాలాన్ని శక్తినీ వృథా చేసుకోవటమే గాని ఏఫలితాన్నీ పొందలేడు. అలాగే దైవాన్ని గురించి, ఉన్నాడా? లేడా? అని వాదన చేస్తూ కాలాన్ని వృథాచేసేవారికన్న గురుకృపచే తనకు లభించిన ఏచిన్న సాధననైనా చేపట్టి దీక్షతో ప్రయత్నంచేసి సఫలీకృతులై శాశ్వత శాంతిని సాక్షాత్కారాన్ని పొందేవారు మేలు.

సమర్థ సద్గురుడగు శ్రీసాయినాథుడు తన భక్తులకు బోధించిన గురుతత్వ రహస్యమిదే. తన ప్రాణములను తన దృష్టియందు నిలిపి తన దృష్టిని తనగురు దేవునిపై నిలిపి తానుపండ్రెండు సంవత్సరాలు తన గురువును సేవించానని, ఆగురు సేవాఫలితంగా తానీస్థితి నందుకున్నానని, గురుదక్షిణగా నిష్ఠ- సబూరీ [ధైర్యము కూడిన ఓర్పు] లనే రెండు పైసలు దక్షిణ తన వద్దనుండి గురువు స్వీకరించారని చెప్తారు. తానే దైవమైనాకూడా తాను గురుసేవా ప్రభావంవల్ల దివ్యత్వాన్ని పొందగలిగానని శ్రీసాయి చేసిన బోధను మనం గమనించినట్లైతే, ఏ మానవుడైనా గురువు ద్వారానే సత్యమైన జ్ఞానమును తెలుసుకోగలడుగాని అన్యమార్గాలవల్ల ఫలితం లభించదనే విషయం స్పష్టమౌతుంది. ఇదే భావాన్ని వేమనయోగి కూడా తన తేట తెనుగు నుడికారంతో తెలియ బరుస్తూ,

" గురువు లేకవిద్య గురుతుగా దొరకదు
అజున కైనవాని యబ్బకైన
తాళపుచెవి లేక తలుపు లెట్లూడురా? " అంటారు.

తనవలెనె దేహేంద్రియాలు కలిగియుండి సామాన్య మానవుని లాగానే కన్పిస్తున్న గురువును దైవంగా అంగీకరించను. సంకుచిత పరిజ్ఞానం గల మనస్సంగీకరించదు. కాని గురువుగా మనం భావిస్తూ గౌరవిస్తున్నది ఆ శరీరంద్వారా ప్రకటమౌతూ మనల్ని ప్రభావితుల్ని చేస్తూ; గమ్యం వైపుకుమనల్ని నడిపిస్తున్న విశేషమైన జ్ఞానాన్ని. ఆ జ్ఞానమే వాస్తవ మైన దైవతత్వం. అదే గురుతత్త్వం గూడా. ఆ తత్వం ప్రకాశిస్తున్న చోట్ల దైవసాక్షాత్కారం (ఆత్మసాక్షాత్కారం) లభించే అవకాశముంది. సూర్యునివెల్గు సమస్తప్రపంచంపై ప్రసరిస్తూ సమస్తాన్ని ప్రకాశింప జేస్తున్నా, మురికిలేని అద్దంలో, నిస్తరంగ కాసారంలో, సహజమైన తన స్వరూపాన్ని ప్రతి బింబింప జేస్తుంది. అలాగే శుద్ధ సాత్విక గుణపరిపూర్ణమైన హృదయంనుండి తన సహజ తత్వం సాక్షాత్కరింప బడుతుంది. అదే దైవ సాక్షాత్కారంగూడా. ఆ సాక్షాత్కార మెలా పొందాలో తెలియజెప్పి పరోక్షానుభూతిని అపరోక్షానుభూతిగా రూపొందించుకునే మార్గమెరిగించి దేహాత్మ భావన అనే అజ్ఞానాన్ని తొలగించి అహంబ్రహ్మాస్మి యనే భావాన్ని తెలియపరచి ముక్తిని పొందే దారి చూపిన వారే సద్గురువు. ఆగురువే దైవంగూడా.

సర్వజ్ఞత సర్వవ్యాపకత; సర్వశక్తిమత కలిగియుండి సర్వమూ తానేనని తన ఆజ్ఞలేక ఆకైనా కదలదని పలికి; తన భక్తులకు ఎన్నో దివ్యానుభూతుల్ని కలుగజేసి; శాశ్వతంగా తానెల్లప్పుడూ యున్నానని తెలియబరచిన సాయి; సద్గురువే కాక సర్వాత్మకుడుగూడా.

ఆ సమర్థ సచ్చిదానంద సద్గురు సాయినాథుని పాదాలను భక్తిపూర్వకంగా పూజిస్తూ ఆతండి చెప్పిన దివ్య తత్వోపదేశాల్ని వివరించుకుని ఆ మార్గంలో పయనించి యీ జీవితాలను ధన్యంచేసుకుందాం!.

శ్రీ నందనవనం వేంకటసుబ్బరామయ్యశర్మ
నందనవనం.

శ్రీ సాయినాధ మహిమార్ణవము

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, రాజాధిరాజు యోగీశ్వరుడు, పరబ్రహ్మ, సచ్చిదానంద సమర్థ సద్గురు శ్రీ సాయినాథుని తనివితీర దర్శించి హృదయ పూర్వకముగా ప్రార్థించి, పూజలు సల్పి జన్మధన్యము చేసుకొను మహా భాగ్యము పొందుటకు ఎందరెందరో భక్తులు పరమ, పవిత్ర షిరిడీ క్షేత్రమునకు అమితోత్సాహముతో ఆర్తితో నిండుమనస్సుతో పరుగిడి వచ్చుచున్నారు. శ్రీ సాయి మహాప్రభువు తనబిడ్డలను తనంతట తానే పిలిపించుకుంటానని ప్రతిజ్ఞ చేసినారు. శ్రీ సాయి అనుజ్ఞలేనిది షిరిడిపుణ్యభూమిపై అడుగిడుట దుర్లభము. సకల దేవతా స్వరూపియైన శ్రీ సాయీశ్వరుని దివ్య లీలలు, మహత్యములు వర్ణింప వేయిశిరస్సులు గలిగిన ఆదిశేషునకు సహితము అలవిగాదు. శ్రీసాయి సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు, సర్వాంతర్యామి, సర్వనియంత. శ్రీ సాయి భగవానుడు తన సర్వ వ్యాపకత్వము ప్రకటపరచు లీలలు భక్తులను ఆశ్చర్యానంద డోలికలలో ఊగించినవి. శ్రీ సాయికి తనను నమ్మిన బిడ్డల యందుగల ప్రేమ, శ్రద్ధ, దయ, రక్షణ భారము నిరూపించుటకు ఎన్నియో తార్కాణములు గలవు. శ్రీ సాయి అవ్యాజ కరుణామూర్తి. ఎవరిని ఎటుల ఎప్పుడు రక్షించ వలయునో, శ్రీ సాయినాథునికే ఎరుక. మన అల్పజ్ఞతతో శ్రీ సాయి ప్రేమతత్త్వమును నిర్ణయింప జాలము. మన ఆలోచనలకు, ఊహలకు, మేధస్సుకు అందని, పొందని తత్త్వమాయనది. అందులకే బహురూపవిశ్వమూర్తయేనమః, అరూపావ్యక్తాయనమః, అచింత్యాయనమః, సర్వాంతర్యామినేనమః, మనోవాగతీతాయనమః, ప్రేమమూర్తయేనమః అని శ్రీ సాయిని అర్చించుచున్నాము. ఆ దివ్యత్వము బుద్ధికి అతీతము. శ్రీ సాయినాథుని పరమ ప్రేమ తత్త్వమును సర్వవ్యాపకత్వము, సర్వజ్ఞత్వము, సర్వే

శ్వరత్వము నిరూపణము చేయు శ్రీసాయి దివ్య లీలా విభూతులు "శ్రీసాయినాథ మహిమార్ణవము"లో ధారావాహికముగ వివరించ బడును.

శ్రీ సాయిబాబా అంకిత బిడ్డలలో శ్రీ ఎమ్. డబ్ల్యు. ప్రధాన్ ఒకరు. వారి భార్య నిరంతరము శ్రీసాయి నామ స్మరణ చేయుచు మహదానందము అనుభవించెడిది. శ్రీసాయినాథుని సేవించాలని, వారి దర్శన భాగ్యము, దివ్యాశీస్సులు పొందాలని ఆమె పసి బిడ్డతో సహా బయలుదేరి మిగుల భక్తి శ్రద్ధలతో షిర్డికి వచ్చినది. ఆ తల్లి ఆనందమునకు అవధిలేదు. ఆ తల్లి ఒక రోజు మధ్యాహ్న సమయమున శ్రీసాయినాథుని అనుజ్ఞ పొంది సద్గురుమూర్తిని అమిత భక్తితో పూజించుట ప్రారంభించినది. దీపారాధన అజ్ఞానాంధ కారమును పారద్రోలుతున్నట్లుగా భాసించుచున్నది. సాంబ్రాణి కడ్డీ వెలిగించి నది. ఆ దివ్య సుగంధ పరిమళము ద్వారకామాయి ఆవరణ మంతా వ్యాపించి విషయవాసనలు దూరముగావించుచున్నవి. ద్వారకామాయి దర్బారులో శ్రీసాయి దివ్యతేజస్సు నలుదిక్కుల ప్రసరించుచున్నది. అబ్దుల్లా బాబా దూరమున నుంచొని సవినయముగా శ్రీ సాయికి నమస్కారములు చేయుచున్నాడు. శ్యామ చామరము వీచు చున్నారు. మహాల్సాపతి తన్మయత్వముతో మైమరచి యున్నారు. తదితర భక్తులందరు విధేయులై తమ శిరస్సులను శ్రీసాయి పాదకమల ములపై నుంచి, శ్రీసాయి అభయమును పొందుటకు ఆత్రతపడు చున్నారు. ఆ మహాతల్లి గులాబీ, మల్లెపూలతో ఆనందప్రదాయి అయిన శ్రీసాయిని అష్టోత్తర శతనామములు చదువుచు, పూజించు ఆనందములో లీనమైయున్నది 'బిడ్డా! నీపూజను కొలదిసేపు ఆపుము, నీవిడిదికి త్వరగా వెళ్ళిరమ్ము' అని మృదు మధురముగా కరుణారస భరితముగా పరమ కారుణ్యమూర్తి శ్రీసాయి పలికి పూజనాపించినారు.

శ్రీ సాయిబాబా ఎందులకు పూజను ఆపమన్నారో, ఏ అవసర నిమిత్తము విడిదికి వెళ్ళిరమ్మన్నారో ఆమెకుగాని అచ్చట

వారలకుగాని అర్థముగాలేదు. అందరి మనస్సులలో సంభ్రమాశ్చ
ర్యములు గలిగినవి. ఎవరికి ఏమియు తోచుటలేదు. గురువాజ్ఞను
పాటించి తీరవలయును గదా! ఆ తల్లి పరుగు పరుగున మసీదుకు
దూరమున నున్న విడిదికి వెళ్ళుచున్నది. ఆమె తన విడిది దగ్గరకు
రాగానే పసిపాప ఏడుపు బిగ్గరగా వినిపించినది. బిడ్డ అంత త్వరగా
నిద్ర లేవదనుకుని ఆమె నమ్మకముతో పూజకు వెళ్ళినది. ఏడ్చు
చున్న పాపను తీసికొని, అక్కున చేర్చుకొని, బుజ్జగించి, పాలిచ్చి,
పరుండబెట్టి మరల ద్వారకా మాయికి బయలుదేరుచూ, శ్రీసాయీ
నాథుని శరణాగత రక్షణముగూర్చి ఆయన సర్వజ్ఞత్వమును గూర్చి
తలపోయుచూ మసీదు చేరినది. ఆ కన్నతండ్రి ఎంత దయా సము
ద్రుడు! అన్న భావావేశము ఆ తల్లి హృదయములో పొంగి పొర
లినది. దివ్య చైతన్యముగలిగించినది. శ్రీ సాయి ఆ తల్లినిజూచి
ఇపుడు నీవు పూజ కానిమ్ము యని మందహాసముతో పలికినారు.
ఆ వదనారవిందమును తిలకించిన ఆ తల్లి కంటి వెంట ఆనంద
భాష్పవర్షము గురిసినది. ఆమె తనువు పులకించినది. శ్రీసాయికి తన
బిడ్డల పైఎంత మక్కువ! తన బిడ్డల బిడ్డలపై ఎంత ఆదరణ!
పూజలో నిమగ్నమై, తన బిడ్డసంగతి తెలియని ఆతల్లికి ఎంతచక్కగా,
తన రక్షణ బాధ్యతను నిరూపించినారు శ్రీసాయి! ఆవిడ విడిది చాల
దూరము. ఆబిడ్డ ఏడుపు ఏమాత్రము వినే అవకాశములేదు. కాని
శ్రీసాయి, సర్వవ్యాపి కాన ఆ బిడ్డ ఏడుపు వినగలిగెను. శ్రీసాయీ
శ్వరుని ఎట్టి ఎదుటన నున్నను మనము ఎంత సంకుచితముగా ఊహించు
చున్నామో అని అచ్చట భక్తసమూహము సిగ్గుచే తలలు వంచినారు.
అట్టి కృపానిధి శ్రీసాయీనాథుని మనము ఇతర చింతలువీడి నిరంతరము
"ఓమ్ శ్రీసాయిరామ్" అనునామస్మరణ చేసి గమ్యము చేరుదము.

'ఓం శ్రీసాయిరామ్ శరణ్'

శ్రీ ఆదిపూడి మోహనరావు
(గౌరవ సంపాదకులు.)

శ్రీరస్తు   శ్రీ సాయీనాథాయనమః   శుభమస్తు



శ్రీ సాయీ ప్రేమాలయము
నందనవనం-523 121

కందుకూరు తా॥ ప్రకాశం జిల్లా

విజ్ఞప్తి

సోదరీ సోదర సాయీ భక్త మహాశయులారా!

మీకందరకు భక్తి పూర్వక నమస్సుమాంజలులు.

ప్రకాశం జిల్లా కందుకూరు తాలూకా నందనవనం గ్రామములో శ్రీ సోదర సాయీ భక్తాగ్రగణ్యుడు శ్రీ నందనవనం వేంకటసుబ్బరామయ్య గారి స్వగృహములో గత 3 సంవత్సరములనుండి శ్రీ షిర్డి సాయి ప్రభువునకు నిత్యము జరుగుచున్న పూజలు, భజనలు సత్సంగ కార్యక్రమములు యీ గ్రామస్తులనేకాక పరిసర గ్రామాలలోని సాయీ భక్తులను ఆకర్షించి, శ్రీ సాయీనాథుని అనుగ్రహాశీర్వాద పూరిత మహిమలను, నిదర్శన పూర్వక ఆనందానుభూతులను అందించుట శ్రీ సాయీశ్వరుని కృపావిశేషమేకాని అన్యముకాదు. ఇట్టి నిదర్శనల నాధారముగ యీ గ్రామమున శ్రీ సాయీ ప్రభువునకు ఒక మందిర నిర్మాణ మొనరించి, అందు శ్రీ సాయీనాథుని విగ్రహ ప్రతిష్ఠాపన కావించవలెనను సత్‌సంకల్పము శ్రీ సాయీ ప్రభువు ప్రేరణచేకలిగి, కొందరు పుణ్యపురుషుల యాశీర్వాదము, కొందరు వదాన్యుల సంసిద్ధత లభ్యపడుట మా సంఘమునకధికోత్సాహము కలిగించినది. మా సంఘమునకు గౌరవాధ్యక్షులుగ వుండుటకు శ్రీ బాపట్ల వెంకట పార్థసారధి గారు శ్రీ సాయీ నిలయం చెరువు (522 113) దయతో అంగీకరించిరి. **"శ్రీ సాయీ ప్రేమాలయము"** అను నామమున నిర్మాణము చేయుచున్న యీ ధర్మకార్య నిర్వహణకు ప్రతి సాయీబాబా భక్తుడు తమ శక్త్యానుసారము ధన, వస్తురూపముల సహాయ సహకారములందించి మా కృషి సఫలీకృతమొనర్చి శ్రీ సాయీ ప్రభువుని కృపకు పాత్రులు కాగలరని మా ప్రార్థన.

గమనిక :

ఉత్తర ప్రత్యుత్తరములు విరాళములు
శ్రీ నందనవనం వేంకటసుబ్బరామయ్య
నందనవనం-523 121
(వయా) సింగరాయకొండ, ప్రకాశం జిల్లా. కుపంపండి.

ఇట్లు
శ్రీ సాయీ ప్రేమాలయము
నిర్మాణ కార్యవర్గాధ్యక్షులు
శ్రీ కోనూరి శింగయ్య

ది వై. వి. ఆర్. ప్రెస్ - సింగరాయకొండ

" ఓమ్ శ్రీ సాయిరామ్ " సంపుటముల

కార్యవర్గము

పరిపాలకులు :-

ఓమ్ శ్రీ సాయిరామ్ ఆధ్యాత్మిక చైతన్య కేంద్రము

(శ్రీ సచ్చిదానంద సమర్థ సద్గురు

శ్రీ సాయినాథ చరణసేవా బృందము)

4-8-5 రామన్నపేట - 2వ లైను, గుంటూరు 522007

గౌరవాధ్యక్షులు:- శ్రీ సాయిభక్త చింతామణి,

శ్రీ సాయిబిక్షువ, శ్రీ సాయి ప్రసన్న

శ్రీ చోడవరపు సాంబమూర్తి పంతులుగారు

శ్రీ షిర్డిసాయి ప్రేమమందిర్

1-8-426 చిక్కడపల్లి, హైదరాబాదు.-20

అధ్యక్షులు :-

శ్రీ Dr. కంచర్ల రామకుమార్

B. Sc; M. B., B. S., M. D.

Asst. Proffesor, Medical College, గుంటూరు.

కార్యదర్శి :-

శ్రీ శ్రీకంఠ కృష్ణమూర్తి, B. A.

Retired Deputy Collector, గుంటూరు-7

సంపాదకులు :-

శ్రీ బాపట్ల వేంకట పార్థసారధి

శ్రీ సాయి నిలయమ్, చెరువు - 522 113

గౌరవ సంపాదకులు :-

' ఓమ్ శ్రీ సాయిరామ్ శరణ్ '

శ్రీ ఆదిపూడి మోహనరావుగారు, రాజమండ్రి.